10052024-DIS-16_Layout 1 5/10/2024 4:29 AM Page 1



'వేదిక' పేజీ కోసం సమకాలీన అంశాలపై వ్యాసాలను
ఈ చిరునామాకు పంపించండి. మీ వ్యాసం 700 పదాలకు మించకుండా ఉండాలి.
చిరునామా: 8-2-603, 1/7,8,9 కృష్ణాపురం, రోడ్ నం.10, బంజారాహిల్స్, హైదరాబాద్-500034.
e-mail: editpage@ntnews.com

# బీసీలు తమ సత్తా చాటాలి

**'తెలంగాణ స్వీయ రాజకీయ అస్తిత్వం' అనేది రాష్ట్ర సాధన ఉద్యమంలో అత్యంత కీలకమైనది. తెలంగాణ స్వీయ రాజకీయ అస్తిత్వమంటే 90 శాతం అట్టడుగు కులాలు, వర్గాల అస్తిత్వం అన్న వాస్తవాన్ని కనుమరుగు చేస్తున్న రాజకీయ పార్టీలు.. వాటి ప్రతాపాలు, పంథాలు, అధికారాల చుట్టే రాజకీయాలను తిప్పేస్తున్నాయి. అధికారాలను, రాజకీయాలను కోడిపందాల ఆటగా ఆధిపత్యం వర్గం మార్చేసింది. పాలించే లక్షణాలు తమ కులానికే ఉన్నాయని చెప్పుకొంటూ ప్రజాస్వామ్య సూత్రాలను దిగజార్చారు. బహుజనుల గుండెలు మండేలా చేశారు. నీళ్లు, నిధులు, భూములు, నియామకాలు.. ఇలా అన్నింటిలో 90 శాతం జనాభా కలిగి ఉన్న అట్టడుగు కులాలు తలెత్తుకుని నిలవటమే తెలంగాణ స్వీయ రాజకీయ అస్తిత్వం అన్నదాన్ని రాజకీయ పార్టీలు కుట్రపూరితంగానే విస్మరిస్తున్నాయన్న విషయాన్ని నేటి తెలంగాణ గమనిస్తున్నది.**



**జూలూరు గౌరీశంకర్**



దూసుకొస్తున్న బహుజన చైతన్యాన్ని తమ వైపునకు తిప్పుకొనేందుకు కొన్ని పార్టీలు బహుజన నాయకత్వమని చెప్తూ ఓట్లు దండుకునే కార్యక్రమాన్ని కూడా మొదలుపెట్టాయి. సమాజంలో సగభాగమైన బీసీలకు చట్టసభల్లోకి పోయే అవకాశాలు లేవు. స్థానిక సంస్థల ఎన్నికల్లోనూ ఆధిపత్య వర్గాలే ఇంకా అధికారం చెలాయిస్తున్నాయి. తెలంగాణ రాష్ట్రంలో అన్నింటిలో బీసీలకు సమ వాటా దక్కాలన్నదే బహుజనుల ప్రధాన లక్ష్యం. అదే కర్తవ్యం కూడా. అవే రేపటి తెలంగాణను తీర్చిదిద్దగల బీసీ సూర్యోదయాలవుతాయి. తెలంగాణ స్వీయ రాజకీయ అస్తిత్వాన్ని ఏ రాజకీయ పార్టీ అయితే ఆకళింపు చేసుకుని, బహుజనులను తమలో ఇముడ్చుకుని నిలువగలదో ఆ పార్టీయే రేపటి తెలంగాణలో నిలువగలుగుతుంది.

తెలంగాణ స్వీయ రాజకీయ అస్తిత్వమంటే బహుజన రాజకీయ అస్తిత్వమన్న విషయాన్ని బీఆర్ఎస్ బలంగా విశ్వసిస్తున్నది. అందుకే పార్లమెంటు ఎన్నికల్లో 6 సీట్లను బీసీలకు కేటాయించింది. ఇది బీసీ వర్గాలకు ఊరట కలిగించింది. గుండె ధైర్యాన్నిచ్చింది. బహుజన రాజకీయ అస్తిత్వాన్ని బీఆర్ఎస్ తనలో ఇముడ్చుకుని భవిష్యత్తు వైపు అడుగులు వేస్తున్నది. ఇది శుభపరిణామం. తెలంగాణ అస్తిత్వాన్ని గెలిపించి నిలిచిన బీఆర్ఎస్.. తెలంగాణ పునర్నిర్మాణంలో బహుజన రాజకీయ అస్తిత్వాన్ని ఎగరేసే జెండాగా నిలవడం ఆధిపత్య రాజకీయాలకు చరమగీతం పాడటమే అవుతుంది. అదే తెలంగాణ సమాజానికి రక్షణ కవచంగా మారుతుంది.

దశాబ్దాల పాటు దేశాన్నేలిన రెండు జాతీయ పార్టీలు 77 ఏండ్లుగా బీసీలను మోసగిస్తూనే ఉన్నాయి. కులగణన చేయబోనని బీజేపీ తెగేసి చెప్పింది. బీసీల గురించి చాలా మాట్లాడుతున్న కేంద్ర పాలకులు బీసీ మంత్రిత్వ శాఖను ఏర్పాటుచేయాలంటే మాత్రం ఒప్పుకోవడం లేదు. ఇన్నేండ్లు ఏమీ చేయని కాంగ్రెస్ అధికారంలోకి వస్తే కులగణన చేస్తామని ఎన్నికల ముందు మరోసారి బీసీ రాగం అందుకున్నది. తెలంగాణలో అధికారం కోసం పెనుగులాడే పెత్తందార్లు బీసీలను ఎప్పుడు పట్టించుకున్నారు? ఎన్నడు మాట్లాడింద్రు? గోరటి వెంకన్న రాసిన 'పల్లెకన్నీరు పెడుతుందో కనిపించని కుట్రల' పాట అస్తవ్యస్తమైన బీసీల బతుకులపై రాసిందే. రెండు దశాబ్దాల కిందట ఈ పాట బీసీల బాధలు తడిమింది. బీసీలకు సంబంధించి ఏదో ఒక మేరకు కొంత కదలిక వచ్చింది, కొంత సత్తువనిచ్చింది, కొంత బతుకుపై నమ్మకాన్నిచ్చింది మాత్రం స్వరాష్ట్రంలో బీఆర్ఎస్ పాలనలోనేనన్నది వాస్తవం.

**తెలంగాణ స్వీయ రాజకీయ అస్తిత్వం కోసం గొంతెత్తి గర్జించి తెలంగాణ రాష్ట్రాన్ని తెచ్చిన కేసీఆరే ఇప్పుడు తెలంగాణ బీసీ రాజకీయ అస్తిత్వ సాధన కోసం ముందుకు వస్తున్నారు. ఆ దిశగా బీఆర్ఎస్‌ను నడిపించేందుకే ఈ పార్లమెంటు ఎన్నికల్లో ఆరు స్థానాలను బీసీలకు కేటాయించారు. స్వాతంత్య్రం వచ్చాక బహుజనులకు ఏం చేస్తారో చెప్పాలని పూలే వేసిన ప్రశ్నకు నేటికీ కేంద్ర పాలకుల వద్ద సమాధానం లేదు. ఆ సమాధానాన్ని వెతికే దిశగా కేసీఆర్ అడుగులు పడుతున్నాయి. ఆ అడుగు తెలంగాణ నుంచే మొదలవ్వాలి.**

తెలంగాణ పునర్నిర్మాణంలో భాగంగా బీసీలకు జరిగిన మేలును బీసీ బిడ్డలు గమనిస్తూనే ఉన్నారు. దేశంలో ఎక్కడాలేనన్ని సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టి బీసీల అభ్యున్నతి కోసం కృషిచేసిన కేసీఆర్ తపనను తెలంగాణ సమాజం ఎప్పటికీ మరిచిపోదు. పోరాడి తెచ్చుకున్న తెలంగాణలో పదేండ్లలో 1,000కి పైగా గురుకులాలు నెలకొల్పటం, ఐదున్నర లక్షల మంది విద్యార్థులు కార్పొరేట్ స్థాయి విద్యనందుకోవటం విప్లవాత్మకమైన చర్యగానే చెప్పాలి. తెలంగాణ రాక ముందు బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ వర్గాల బిడ్డలకు పురుగులన్నం పెట్టిన నాయకులు.. ఇప్పుడు బీసీలకు మేలు చేస్తామని వాగ్దానాలు చేస్తున్నారు. ఎన్నికల సంగ్రామం కాబట్టి ఓట్ల కోసం వారు ఏమైనా మాట్లాడవచ్చు. కానీ, అసలు వాస్తవాలను ప్రజలు గ్రహించాలి.

గత అసెంబ్లీ ఎన్నికల్లో, ప్రస్తుత పార్లమెంటు ఎన్నికల్లో జనాభా దామాషా ప్రకారం బీసీలకు సీట్లు ఇవ్వని పార్టీలకు బీసీల గురించి మాట్లాడే అర్హత ఎక్కడిది? 77 ఏండ్లుగా బీసీలను ఓట్లేసే యంత్రాలుగా, చప్పట్లు కొట్టే చేతులుగా మార్చిన కాంగ్రెస్, బీజేపీల కుటిల, కుట్ర రాజకీయ తంత్రాలను బీసీలు తెలుసుకోవాలి. బీసీ డిక్లరేషన్లు ప్రకటించి చేతులు దులిపేసుకుంటున్న కాంగ్రెస్, బీజేపీ రాజకీయ ముసుగులను తొలగించాలి. సామాజిక బహుజన ప్రజాస్వామ్యాన్ని తెలంగాణలో నెలకొల్పుకోవాలి. కులగణన చేయాలని అడిగితే దేశసమగ్రత దెబ్బతింటుందని చెప్పే బీజేపీ వాదనను ఓట్ల ద్వారా తిప్పికొట్టాలి. ఎంతోకాలంగా బీసీలను దగా చేస్తున్న కాంగ్రెస్ అసలు నైజాన్ని బయటపెట్టాలి. బీసీ కులగణనను, రిజర్వేషన్లను తొక్కిపెట్టిన, అణచివేసిన కాంగ్రెస్, బీజేపీలను తరిమికొట్టాలి.

దేశానికి స్వాతంత్య్రం వచ్చిన తర్వాత కూడా స్వతంత్రం రానివాళ్లు బీసీలే. దేశంలో సగానికి పైగా జనాభా ఉన్న బీసీలకు రాజ్యాంగబద్ధ రిజర్వేషన్లు లేకపోవడం విచారకరం. తెలంగాణ స్వీయ రాజకీయ అస్తిత్వం కోసం గొంతెత్తి గర్జించి తెలంగాణ రాష్ట్రాన్ని తెచ్చిన కేసీఆరే ఇప్పుడు తెలంగాణ బీసీ రాజకీయ అస్తిత్వ సాధన కోసం ముందుకు వస్తున్నారు. ఆ దిశగా బీఆర్ఎస్‌ను నడిపించేందుకే ఈ పార్లమెంటు ఎన్నికల్లో ఆరు స్థానాలను బీసీలకు కేటాయించారు. స్వాతంత్య్రం వచ్చాక బహుజనులకు ఏం చేస్తారో చెప్పాలని పూలే వేసిన ప్రశ్నకు నేటికీ కేంద్ర పాలకుల వద్ద సమాధానం లేదు. ఆ సమాధానాన్ని వెతికే దిశగా కేసీఆర్ అడుగులు పడుతున్నాయి. ఆ అడుగు తెలంగాణ నుంచే మొదలవ్వాలి.

బీసీలకు చట్టబద్ధంగా దక్కాల్సిన స్థానాల కోసం స్థానిక సంస్థల్లో బీసీలకు సగం సీట్లు ఇచ్చే దిశగా బీఆర్ఎస్ భవిష్యత్తు కార్యాచరణను రచిస్తున్నది. వీపీ సింగ్‌లాగా బీసీల హక్కుల సాధన కోసం కేసీఆర్ వస్తారన్న నమ్మకం నాకుంది. తెలంగాణలో జరగాల్సిన బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ వర్గాల స్వీయ రాజకీయ అస్తిత్వం కోసం జరిగే ఉద్యమానికి బీఆర్ఎస్ మాత్రమే గొంతుకగా నిలువగలదు. డీఎంకేలాగా చెక్కుచెదరని తెలంగాణ స్వీయ రాజకీయ అస్తిత్వాన్ని నిలిపే పార్టీగా ముందుకువచ్చి నిలువగలిగింది బీఆర్ఎస్ ఒక్కటే. భవిష్యత్తు తెలంగాణకు బీఆర్ఎస్సే కొత్తదారిని చూపుతుంది.

బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ వర్గాలు అన్నిరంగాల్లో ఎదగాలి. సంపదలన్నీ సంపద సృష్టికర్తలకు మొదటగా అందాలి. నిధులు, నియామకాల్లో బహుజనుల వాటా వారికే దక్కేలా చట్టాలు తేవాలి. అన్నిరంగాల్లో బీసీలు శిరస్సు ఎత్తుకుని నిలిచే విధంగా రాజకీయ రూపకల్పన జరిగినప్పుడే అది తెలంగాణ స్వీయ రాజకీయ అస్తిత్వంగా నిలువగలుగుతుందని బీఆర్ఎస్ బలంగా నమ్ముతున్నది. బీసీల అస్తిత్వం పెరిగితేనే బహుజన తెలంగాణ అస్తిత్వం పెరుగుతుంది. అప్పుడు మాత్రమే బహుజనులు స్వతంత్రంగా వ్యవహరించగలుగుతారు. బహుజనులకు ఉత్పత్తి సాధనాలంటే ప్రాణం. అలాంటి ఉత్పత్తి సాధనాల విషయంలో బీసీలే యజమానులుగా మారాలి. బీసీల వాటా బీసీలకే దక్కాలి. చదువుల్లో ఎదగాలి. సంపదలు పొందాలి.

**చదువుల్లోనైనా, సంపదలోనైనా, పాలనలోనైనా, అధికారంలోనైనా బీసీలు తమ వాటా తాము పొందాలన్న లక్ష్యం వైపుగా బీఆర్ఎస్ దారులు వేస్తున్నది. అందుకే పార్లమెంట్ ఎన్నికల్లో ఆరు సీట్లను కేటాయించింది. ఇప్పుడు వారిని గెలిపించుకోకపోతే భవిష్యత్తులో ఏ పార్టీ కూడా బీసీలకు టికెట్లు ఇవ్వదు. కాబట్టి బీసీ స్వీయ రాజకీయ అస్తిత్వం దిశగా అడుగులు వేస్తున్న బీఆర్ఎస్ అభ్యర్థులను గెలిపించాల్సిన బాధ్యత మనందరిపై ఉన్నది. అదే తెలంగాణ స్వీయ రాజకీయ అస్తిత్వానికి ప్రాణంగా నిలుస్తుంది.**

**నమస్తే తెలంగాణ**

## ఉత్తరం-దక్షిణం

శ్యాం పిట్రోడా సాంకేతిక నిపుణుడు. రాజీవ్‌గాంధీ ప్రధానిగా ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో టెక్నాలజీ మిషన్‌కు నాయకత్వం వహించిన వ్యక్తిగా ఆయన దేశానికి చిరపరిచితుడు. ఆయన ఇటీవల రెండు అంశాల మీద చేసిన వ్యాఖ్యలు దుమారం రేపడమే కాకుండా కాంగ్రెస్‌ను ఇరకాటంలో పడేశాయి. అందులో మొదటిది వారసత్వ పన్నుపై చేసిన వ్యాఖ్య, రెండవది దక్షిణాదివారి రంగుకు సంబంధించిన విశ్లేషణ. వీటిని బీజేపీ తనకనుకూలంగా మార్చుకొని ఎదురుదాడికి దిగడం తెలిసిందే. దక్షిణాది వారి రంగు ఆఫ్రికన్లకు దగ్గరగా ఉంటుందని పిట్రోడా అంటే, రాష్ట్రపతి ముర్మును ఉద్దేశించే ఆయన ఆ మాటలన్నారని బీజేపీ నేతలు కొత్త భాష్యం చెప్పారు. రెండుపార్టీల ధోరణుల మధ్య పెద్దగా తేడా చూడలేం. ఆ సంగతి అలా ఉంచితే పిట్రోడా వ్యాఖ్యలతో ఉత్తర-దక్షిణ వైరుధ్యాలు ప్రముఖంగా చర్చకు వచ్చాయి. మన దేశంలో ఈ విభజన కేవలం భౌగోళికపరమైందే కాదు, సాంస్కృతికపరమైనది కూడా అని చెప్పాలి. భాషాపరంగా ఉత్తరాది ఇండో-ఇరానియన్ వర్గానికి చెందితే.. దక్షిణాది భాషలు ద్రావిడ కుటుంబానికి చెందడం అనే వాదన ఉన్నా అదిక్కడ చర్చాంశం కాదు.

ఉత్తరాది రాజకీయ ఆధిపత్య ధోరణులు ఇటీవలికాలంలో చాలానే చర్చకు వస్తున్నాయి. ఢిల్లీపై ఉత్తరాది వారు పెత్తనం చెలాయిస్తూ దక్షిణాదిని వివక్షకు గురిచేస్తున్నారన్న ఆవేదన దాదాపుగా అన్ని దక్షిణాది రాష్ట్రాల్లో వ్యక్తమవుతున్నది. ఇప్పటివరకు దేశ ప్రధాని పదవి చేపట్టిన 14 మందిలో దక్షిణాది వారు ఇద్దరంటే ఇద్దరే (పీవీ, దేవెగౌడ) ఉండటం ఈ సమస్యకు ఓ ప్రతీకగా చెప్తుంటారు. ఈ విషయంలో జాతీయ పార్టీలుగా విర్రవీగే కాంగ్రెస్, బీజేపీ రికార్డు తెలిసిందే. ఒకరు మొదలుపెడితే మరొకరు దాన్ని పటిష్ఠం చేశారంతే. జనాభా విధానం, పేదరికం అంచనా ప్రాతిపదికలు, నిధుల కేటాయింపు వంటి అంశాల విషయంలో ఉత్తరాది నేతల ఆధిపత్యంలోని కేంద్రం అనుసరిస్తున్న విధానాలు దక్షిణాదికి ప్రతికూలంగా ఉండటమే కాకుండా తీవ్రస్థాయి నష్టం కలిగిస్తున్నాయనే భావన ప్రబలంగా ఉన్నది. ఉదాహరణకు, దక్షిణాది నుంచి పన్నుల రూపంలో కేంద్రానికి అందుతున్న ఆదాయం ఎక్కువ. అదే సమయంలో కేటాయింపుల రూపంలో అందుతున్న వాటా చాలా తక్కువ. అంటే అధిక ఆదాయం సమకూర్చే దక్షిణాది తక్కువ కేటాయింపులతో సరిపెట్టుకోవాల్సి వస్తున్నదన్న మాట. సంపద సృష్టిలోనే కాకుండా విద్యలోనూ ఉన్నతంగా ఎదిగిన దక్షిణాది రాష్ట్రాలు కుటుంబ నియంత్రణను గణనీయమైన స్థాయిలో పాటించి జనాభా నియంత్రణలో తోడ్పడుతున్నాయి. అదే ఉత్తరాది రాష్ట్రాలు ఈ రెండింటిలోనూ వెనుకబడి ఉన్నాయి. కానీ కేటాయింపులు జనాభా ప్రాతిపదికన జరపాలన్న నిబంధనల వల్ల అధిక నిధులను పొందగలుగుతున్నాయి. అభివృద్ధిలో అగ్రగామిగా నిలిచినందుకేనా ఈ వివక్ష అని దక్షిణాది రాష్ట్రాలు మథనపడుతున్నాయి.

ఈ నేపథ్యంలోనే పార్లమెంటు నియోజకవర్గాల పునర్విభజన కత్తి దక్షిణాది మెడపై వేలాడుతున్నది. ఉత్తరాది జనాభా అధికం కనుక అక్కడ నియోజకవర్గాలు పెరిగిపోయి దక్షిణాదిలో జనాభా తక్కువ కనుక ఇక్కడ సీట్లు తరిగిపోయే ప్రమాదం ఉన్నది. ఇది ఉత్తరాది రాజకీయ ఆధిపత్యాన్ని మరింతగా పటిష్ఠం చేస్తుందనడంలో సందేహం లేదు. మదరాసీ అనే గుర్తింపు కింద దక్షిణాది భాషల, సంస్కృతులను చాపకిందకు నెట్టడం, అదే పనిగా హిందీని రుద్దడం వంటి సమస్యలు ఎటూ ఉండనే ఉన్నాయి. అయోధ్య రామయ్య గురించి హంగామా చేసేవారు భద్రాద్రి రామయ్య పేరైనా తలవకపోవడం ఏ రకంగా సమర్థనీయం? ఇదేదో రాజకీయాలకే పరిమితమైన సమస్య అనుకుంటే పొరపాటే. ఇటీవల నీట్ పరీక్షను ఏ మాధ్యమంలో నిర్వహించాలనే విషయమై వివాదాలు ముసురుకోవడం దేశ సమైక్యతకు తోడ్పడే అంశమేనా? ఏ రకంగా చూసినా ఉత్తర, దక్షిణ విభజన అనేది ఎన్నాళ్లుగానో పరిష్కారం కోసం ఎదురుచూస్తున్న లోతైన సమస్య. ఏ దేశంలోనైనా అన్ని ప్రాంతాలూ తమకు సమ ప్రాతినిధ్యం, రక్షణ ఉన్నాయని భావిస్తేనే ఆ దేశం ముందుకు వెళ్లగలుగుతుంది. అమెరికాలో ఉత్తర-దక్షిణ తగాదాలే తీవ్ర సమస్యలకు దారితీసిన సంగతి చరిత్రకు తెలుసు. ఒకప్పుడు జర్మనీ, పాకిస్థాన్, కొరియా తదితర దేశాలన్నీ ఇలాంటి సమస్యలతోనే సైద్ధాంతిక విభేదాల్లో కూరుకుపోయాయి. వివక్షలు, వ్యత్యాసాలపై భారత్‌లోని దక్షిణాది ప్రాంతీయ పార్టీలు బలంగా గొంతు విప్పుతున్నాయి. వీటినుంచి కర్తవ్య ప్రబోధం పొంది జాతీయపార్టీలు దేశ హితం కోసం తమ విధానాలను మార్చుకొని దిద్దుబాటు చర్యలకు మళ్లాల్సిన అవసరం ఎంతైనా ఉన్నది. అట్లా కాదని నోటికొచ్చినట్టు మాట్లాడితే ప్రజలు వారికి తిరుగులేని గుణపాఠం చెప్పేరోజు ఎంతో దూరంలో లేదని చెప్పవచ్చు.




## జ్ఞానమే గురువు ఆచారమే లింగం

**21వ శతాబ్దంలోనూ బీసీలు, మహిళలు, ఇతర వర్గాలు చట్టసభల్లో ప్రాతినిధ్యం కోసం కొట్లాడుతున్నాయి. ఆర్థిక, సామాజిక అసమానతలపై ఇప్పటికీ అనేకచోట్ల పోరాటాలు జరుగుతున్నాయి. కానీ, ఎప్పుడో శతాబ్దాల కిందటే కుల, మత, వర్గ, వర్ణ వ్యవస్థలను, అసమానతలను రూపుమాపేందుకు సమరభేరి మోగించిన గొప్ప సంఘసంస్కర్త బసవేశ్వరుడు.**

నేటి కర్ణాటక రాష్ట్రం బీజాపూర్ జిల్లా బాగేవాడిలో క్రీ.శ.1134లో ఆనందనామ సంవత్సరంలో జన్మించిన బసవేశ్వరుడు వీరశైవ సంప్రదాయాన్ని మహోజ్వలంగా ప్రజల్లోకి తీసుకెళ్లిన గొప్ప భక్తుడు. లింగాయత ధర్మ సృష్టికర్త, విశ్వగురువు, మహా మానవతావాది. స్త్రీ, పురుష అసమానతలను తొలగించడానికి కృషి చేసిన అభ్యుదయవాది బసవేశ్వరుడు. బాల్య వివాహాలు, సతీ సహగమనం వంటి దురాచారాలను రూపుమాపేందుకు ఆయన ఆనాడే కృషి చేశారు. దురాచారాలు స్వార్థపరుల సృష్టి అంటూ వాటిపై సమరభేరి మోగించారు. తద్వారా సర్వసమానత్వమే శాంతికి మూలమని ఉపదేశించారు.

జాతి, వర్గ భేదం లేకుండా అందరూ దీక్షా సంస్కారం పొందవచ్చునని చెప్పిందే లింగాయత ధర్మం. దళితులకు ఆలయ ప్రవేశం కల్పించాలని ఘోషించిన అపూర్వ ప్రగతిశీలి, మొట్టమొదటి కులాంతర వివాహం చేసిన గొప్ప సంఘసంస్కర్త ఆయన. మనుషులు శాంతి సామరస్యాలతో సహజీవనం గడపాలని బోధించారు. సుఖసంతోషాలకు కష్టపడి పనిచేయాలని నిరాడంబర జీవితం గడపాలని ఉపదేశించారు.

వ్యక్తుల జీవితాలను సమాజ గమనాన్ని ప్రభావితం చేసే విధంగా బసవన్న తన సొంత ఒరవడిలో కొత్త ధర్మాన్ని సృష్టించారు. అదే లింగాయత ధర్మం. అనాదిగా వస్తున్న మూఢ నమ్మకాలను, ఆచారాలను బసవణ్ణ తీవ్రంగా ఖండించారు. ఆయనకు పూర్వం స్త్రీలకు, పంచములకు ధార్మిక, సామాజిక, ఆర్థిక, రాజకీయ హక్కులు ఉండేవి కావు. బసవణ్ణ ఆగమనంతో అందరూ అన్ని బంధాల నుంచి విముక్తి పొందారు. సమాజ నిర్మాణంలో ఆయన దార్శనికత, నాయకత్వం ఇప్పటికీ స్ఫూర్తినిస్తూనే ఉన్నాయి. బసవణ్ణకు పూర్వపు యుగంలో పంచములకు, వెనుకబడిన కులాల వారికి దేవాలయంలోకి ప్రవేశం ఉండేది కాదు. దాన్ని రూపుమాపే ఉద్దేశంతో సమ సమాజ స్థాపన కోసం దేవుడినే భక్తుడి వద్దకు తీసుకురావడానికి ఇష్టలింగాన్ని బసవేశ్వరుడు కనిపెట్టారు. పరమ శివునికి ప్రతిరూపమైన ఇష్టలింగాన్ని చేతికిచ్చి గుడి సంస్కృతిని, కుల వ్యవస్థను అంతమొందించారు. ఆచార పారాయణులు పంచములను గుడిలోపలికి రానివ్వనపుడు ఆ గుడిలోని లింగాన్ని తెచ్చి వారి ఒడిలో ఉంచిన మహనీయుడు బసవణ్ణ. మాంసాహారాన్ని త్యజించి శాకాహారాన్ని స్వీకరించడం ఇష్టలింగాదరణ, ఇష్టలింగ పూజ. ఇదే బసవణ్ణ సూచించిన భక్తి మార్గం. మనుషుల మధ్య, మతాల మధ్య సామరస్యం ఉండాలని ఆకాంక్షించిన ఆయన మొట్టమొదటి కులాంతర వివాహం చేసి సమాజ గమనాన్ని ప్రభావితం చేశారు.

**'జ్ఞానమే గురువు. ఆచారమే లింగం. దేహమే దేవాలయం. స్త్రీ, పురుష భేదం లేదు. శ్రమకు మించిన సౌందర్యం లేదు. పనిని మించిన దైవం లేదు. కష్టాన్ని మించిన భక్తి లేదు. భక్తి కన్న సత్ప్రవర్తనే ముఖ్యం' అని చేసే పనిలో దేవుడిని చూసే మార్గాన్ని చూపించి కాయకష్టమే కైలాసం అనే కొత్త ఒరవడికి నాంది పలికారు బసవేశ్వరుడు.**

బీసీలు, మహిళలు, ఇతర వర్గాలు చట్టసభల్లో ప్రాతినిధ్యం కోసం ఇప్పటికీ కొట్లాడుతున్నాయి. నేటి మన పార్లమెంటరీ వ్యవస్థతో సమానమైన అభినవ మంటపాన్ని బసవేశ్వరులు ఆనాడే స్థాపించారు. అందులో జాతి, కుల, వర్గ, వర్ణ భేదాలు లేకుండా అందరికి సమాన అవకాశం కల్పించిన అపూర్వ ప్రజాస్వామ్యవాది బసవణ్ణ. నేటి ప్రభుత్వాలు, పాలకులు బసవేశ్వరుడిని ఆదర్శంగా తీసుకోవాలి. బీసీలు, మహిళలు, బలహీనవర్గాలకు చట్టసభల్లో అడుగుపెట్టేందుకు అవకాశం కల్పించాలి.



**శుభప్రద్ పటేల్ నూలి**
97010 69698
(వ్యాసకర్త: రాష్ట్ర బీసీ కమిషన్ సభ్యులు)

# దొందూ దొందే!



**కనకదుర్గ దంటు**

**కృతయుగంలో ధర్మం అన్నింటికంటే తీపి.. త్రేతాయుగంలో నిజాయితీ, బాధ్యత అన్నింటినీ మించినవి.. ద్వాపరయుగంలో పై రెండు యుగాల కంటే చెడు పెరిగింది కాబట్టి, చెడ్డవారి నిర్మూలనే ధ్యేయం. మరి కలియుగంలో ధర్మం, నిజాయితీ, బాధ్యత, మంచి ప్రవర్తన అన్నింటినీ మించి డబ్బే ముఖ్యం, డబ్బే అమృతం! డబ్బు కోసం, ముఖ్యంగా తేలికగా సంపాదించటం కోసం ఈ కాలంలో మనిషి చేయని అకృత్యమేమైనా ఉందా?**

త్రేతాయుగపు శ్రీరాముడు స్వయంగా ధర్మస్వరూపుడిగా నిలిచి చూపిస్తే, ద్వాపరయుగపు శ్రీకృష్ణుడు ప్రవచించి చెప్పాడు. ఇక కలియుగంలో నేరాలు ఎక్కువగా ఆర్థిక అసమానతల వల్ల జరుగుతాయని కార్ల్‌మార్క్స్ చెప్పాడు. కానీ, ప్రస్తుత రాజకీయ, సామాజిక రంగాలను పరిశీలిస్తే, మార్క్స్ సిద్ధాంతం కూడా పూర్తిగా సరైనదని అనిపించటం లేదు. ఎందుకో పరిశీలిద్దాం!

ఇప్పుడు పరిస్థితి ఎలా ఉన్నదంటే ఉన్నవాడికి తృప్తి లేదు. ఇంకా సంపాదించాలనే యావ. ఇది అవసరాలు తీరక కాదు. నీతి, నిజాయితీ తక్కువై, స్వార్థం పెరిగిపోయి ఈ పరిస్థితి దాపురించింది. జనాభా అధికంగా ఉన్న భారతదేశంలో అందరూ బాగుండాలంటే ప్రతిరంగంలోనూ కొన్ని నిబంధనలుండాలి. ఉదాహరణకు ఒక వ్యాపారస్థుడికి ఒకటి, రెండు రంగాల్లో- అదీ ఒక స్థాయివరకే ఉండాలి. ఆడవారి బిందీ బొట్ల నుంచి, విమానాశ్రయాలు, ఓడరేవులు, గ్యాస్ వ్యాపారాలు, బొగ్గు ఇతర గనులు ఒకడికో, కొందరికో కట్టబెట్టే వీలుండకూడదు. ప్రస్తుత రాజకీయ పరిస్థితి చూస్తుంటే దేశ భవిష్యత్తు గురించి ఆందోళన కలుగుతున్నది. మోదీ మళ్లీ ప్రధానమంత్రి అవ్వాలని, బీజేపీ గెలవాలని ప్రచారం చేస్తున్నవారు ముఖ్యంగా చెప్తున్న మాట ఒకటి ఉన్నది. నెహ్రూ కుటుంబం దేశాన్ని దోచుకుంది, ఏ రకమైన ప్రగతి లేదు, మమ్మల్ని గెలిపిస్తే ఉద్ధరిస్తామంటున్నారు. దూరదృష్టి కొరవడిన నెహ్రూ ఐఐటీలు, ఐఐఎంలు స్థాపించి మేధోవలసలకు తలుపులు తెరిచాడు, కాంగ్రెస్ నాయకులు దోచుకుతిన్నారు రెండూ నిజమే! మరి బీజేపీ గత పదేండ్లుగా చేస్తున్న నిర్వాకమేమిటి?

మోదీ ఒంటరిగా జీవిస్తాడు, కుటుంబం, పిల్లలు లేరు కాబట్టి సన్యాసిగా బతుకుతూ దేశ ప్రజలకు సేవ చేస్తాడన్నది మోదీ భక్తులు చెప్పే ముఖ్యమైన మాట. మరి జరుగుతున్నదేమిటి? లేమిలో పుట్టి, లేమిలో పెరిగాడు కాబట్టి పది లక్షల ఖరీదు చేసే సూట్లు వేసుకొని విదేశాల్లో తిరిగితే 'పోనీలే పాపం!' అనుకున్నాం. కానీ, ఇప్పటి పరిస్థితిలో మోదీజీకే ఎక్కువ ధనం అవసరం అవుతున్నది.

ప్రధానమంత్రి స్థానం అధిష్ఠించినప్పటి నుంచీ, కొందరు గుజరాతీ వ్యాపారస్థులను ప్రోత్సహించి దేశ సంపద కట్టబెట్టడంలో మోదీకి ఉత్సాహమెందుకు? ఎందుకంటే ప్రస్తుతం దేశంలో అందరి కంటే డబ్బు అవసరం ఒంటరిగా జీవించే ప్రధాని పార్టీకే ఉంది. విమానమో, ఒక నౌకో కొనాలంటే కొద్దిగా ఎక్కువ ధనమే అవసరం. మరి మనుష్యలను కొనాలంటే? శాసనసభ్యులు, పార్లమెంటు సభ్యులు చౌకగా దొరుకుతారా? దొరకరు కదా! రేపు ఎన్నికల ఫలితాల తర్వాత వందో, రెండొందల సభ్యులో బీజేపీ తీర్థం పుచ్చుకోవాలంటే చాలా పెద్ద మొత్తం ప్రసాదం ఇవ్వాలి కదా!

కనుక భార్య, పిల్లలు లేనివాళ్లందరూ వాజపేయిలాగా ఉంటారనుకోకండి. వారి కోరికలు, ఆశలను బట్టి వారికే ధనం అవసరమవుతుంది. శ్రీలంక దేశం మొత్తం అదానీ విద్యుత్తు వాడుతోందంటే, అందులో ఎవరి వాటా ఎంత ఉంటుందో ఊహించండి. అబద్ధాల ప్రచారాలు, డంబాలు చెప్పే నాయకుల మాటలు నమ్మకుండా జరుగుతున్న భాగోతాలు చూసి, గమనించి, అర్థం చేసుకొని ఓటేయండి. ఎదుటివాడు చెడ్డవాడని చెప్తే చెప్పేవాడు మంచివాడని అర్థం కాదు. కాంగ్రెస్, బీజేపీ ఇద్దరూ ఇద్దరే! దేశ సంపద ఎవడు తింటే ఏం! ఇటలీ వాడైనా, గుజరాతీ వాడైనా, సామాన్య ప్రజల బతుకులు బండలవుతుంటే ఎవడైనా ఒక్కటే. మన దేశం వాళ్లు కుబేరులవుతున్నారని మురిసిపోకండి. ఈ కుబేరులంతా విదేశాలకు పారిపోయి, స్థిరపడి మన సంపదతో అక్కడ వ్యాపారాలు చేస్తున్నారు. ఈ రెండు జాతీయ పార్టీలు తమ నిజస్వరూపాన్ని చూపాయి కనుక, ఏ రాష్ట్రం వారు ఆ రాష్ట్రంలో ఉన్న ప్రాంతీయ పార్టీకి, ప్రజలను ప్రేమించే నాయకులకు, పార్టీలకు ఓటు వేయండి. పార్లమెంటు ఎన్నికల్లో కాంగ్రెస్, బీజేపీకి ఓట్లు పడనీయకండి. సంకీర్ణ ప్రభుత్వం వస్తే అటు కేంద్రానికి, ఇటు అన్ని రాష్ట్రాలకూ ఎంతో కొంత మంచి జరుగుతుంది.

## విద్వేషమే వారి 'మతం'



*జనగణన నిర్వహణలో విఫలమైన మోదీ ప్రభుత్వం ముస్లింల జనాభా పెరుగుతున్నదని ఒక నివేదికను ముందుకుతెచ్చింది. ముస్లింల సంతానోత్పత్తి గణనీయంగా తగ్గిందని చెప్తున్న తాజా జాతీయ కుటుంబ సర్వే రిపోర్ట్ సమాచారం కాకుండా పాత డాటాను కేంద్రం ఎందుకు చూపుతున్నది? ఓటరులారా.. ఆలోచించండి. మీకు ఇంకో ఐదేండ్లపాటు అసమర్థమైన, విద్వేషాన్ని పెంచే ప్రభుత్వం కావాలా?*

**- సాగరికా ఘోష్,** *తృణమూల్ కాంగ్రెస్ ఎంపీ*

